

# అక్కడ పూసిన పువ్వు

విపుల మాస పత్రిక- మార్చి, 2007

# అక్కడ పూసిన పువ్వు

"కాంతీ, కాస్త కారాపు!" ఓ పెడబొబ్బ పెట్టినంత పనిచేసింది విశాలి.

"విశాలీ... నీకు ఎన్నిసార్లు చెప్పాను... అలా అరిచి దడిపించవద్దని! అయినా, మనమేమయినా మన ఊళ్లో విహరిస్తున్నామా... ఎక్కడ పడితే అక్కడ ఆపడానికి! మినియాపోలీస్ నడిరోడ్డు మీద వెళుతున్నాం. కాస్త అటూ ఇటూ అయిందో - టికెట్ ఇచ్చేస్తారు!" కాంతి సీరియస్‌గానే అంది. స్టీరింగ్ పైన చేతులు వత్తిపెట్టి , చూపులు రోడ్డుపై నొక్కిపెట్టి.

"బక్కెట్ తన్నేస్తారు అన్నట్లు ఏంటా టిక్కెట్ ఇచ్చేస్తారు అనడం!" భుజాలెగరేసి అంది విశాలి, "కాంతీ, ఒక్కసారి కారు ఆపవే తల్లీ - అటుచూడు... ఏముందో అక్కడ..." కంగారు పడుతూ బతిమిలాడుతున్నట్లుగా అంది విశాలి. ఏదో అపురూపమైన దృశ్యం కనుమరుగైపోతున్నట్లుగా.

"సారీ, మై డియర్ సిస్టర్! ఇక్కడ ఎక్కడ చూసినా అందంగానే ఉంటుంది. నువ్వు తబ్బిబ్బైన చోటల్లా కారాపితే - ఇక అంతే సంగతులు-" కారు వేగం ఏమాత్రం తగ్గించకుండా కాస్త గట్టిగానే అంది కాంతి, "ఇంక పదినిమిషాల్లో ఇంటికి వచ్చేస్తాం. కాస్త స్థిమితంగా కూర్చోవే తల్లీ!"

"అరరే.... వెళ్ళిపోతోంది... వెళ్ళి...పో...యిం...ది..." చిన్న పిల్లలా దిగాలుగా అంది విశాలి.

"విశాలీ... కదలకుండా కూర్చో... సీట్ బెల్ట్ తీసేసి మరీ...ఏంటది...?" కాంతి కోప్పడింది.

తనను అంతగా ఆకర్షించిన విశేషమేమిటో కాంతి అడగకపోగా, పైనుంచి కోప్పడడం విశాలికి నచ్చలేదు. అసహనంగా అటూ ఇటూ కదిలింది. కాంతి మాటలు పట్టించుకోలేదన్నట్లుగా- మెడ వెనక్కి తిప్పి - తన కనుచూపు మరుగయ్యే వరకూ అటువైపు చూస్తూనే ఉంది. కళ్ళారా.

'కాంతి కారాపకపోతేనేం? తనే స్వయంగా రాలేదా?' విశాలి నొసలు చిట్లించింది. దారిని జాగ్రత్తగా గమనించసాగింది. అక్కడక్కడ కొండ గుర్తులు పెట్టుకుంటూ మౌనంగా కూర్చుంది.

పిల్లలు కొలతలు వేసి శ్రద్ధగా గీసుకున్న రేఖాగణితపు పటాల్లా చక్కగా ఉన్నాయి. రోడ్లు , వాటి పక్కన భవనాలు. మరింత జాగ్రత్తగా కొలువుల్లో పేర్చిన బొమ్మల్లాంటి ఇళ్ళు. ఎక్కడికక్కడ దిశానిర్దేశాలు.

'బావుంది. చాలా బావుంది.' విశాలి మనసులోనే ముచ్చటపడింది, 'ఒకవేళ తను ఒక్కటే ఆ ప్రదేశానికి వెళ్ళాలనుకున్నా నేరుగా వెళ్ళిపోవచ్చు! కారులో పది పదిహేను నిమిషాలు. కాలినడకన అరగంటైనా ఫరవాలేదు.'

అంతే, ఆ ఆలోచనతోనే విశాలికి ఎక్కడలేని హుషారు వచ్చేసింది. ముఖాన చిరునవ్వు కదలాడింది. కుదురుగా కూర్చుంది.

'ఎంతకాలం నుంచీ వెతుకుతోంది - ఆ పువ్వుకోసం!' విశాలి నిట్టూర్చింది.

'ఆకుకొక్క పువ్వులా విరబూసి ఉంది. ముళ్ళకంచె మీదుగా.

అబ్బ! ఎంత కళగా ఉందో!

అది లేతవన్నె గులాబిపువ్వు. మామూలు గులాబిపువ్వు. నాటు గులాబిపువ్వు.

ఇప్పుడంటే వందలాది రకాల్లో రంగుల్లో కనబడుతున్నాయి కానీ, తమ చిన్నప్పుడు గులాబీలంటే ముచ్చటగా మూడు రంగులే. తెలుపు, ఎరుపు, గులాబి.

ఈ ముప్వన్నెల గులాబీలు లేని ముంగిలి ఉండేదా మా ఊళ్ళో? ఎటొచ్చి, లేతగులాబీ లేనిది తమ ఇంట్లోనే? తెలుపంటే తెలుపే. కానీ, ఎరుపంటే ఎరుపుకాదు. నిండు గులాబి, రాణిరంగు, చంద్రకాంత రంగు, కెంపురంగు – ఏదైనా సరే, అది ఎర్ర గులాబి గానే చలామణి అయిపోయేది.

ఏది ఏమైనా గులాబి పువ్వంటే లేత గులాబి వన్నె గల గులాబి పువ్వే!

దాని రంగు, నునులేత పూరేకుల నేవళం, గుమ్మని గుబాళింపుల పరిమళం – ఓహ్!

అయినా, రోజులంటే అవీ!

ఒక్క వాన చినుకు పడితే చాలు. ఊళ్ళో పిల్లలందరం మొక్కలు నాటడానికి పరుగులు. అటకల మీద డబ్బాలను, అట్టపెట్టెలను దించేసేవాళ్ళం. కాగితాలతో పొట్లం కట్టి దాచి ఉంచిన పూల విత్తనాలన్నిటిని గబగబ బయటకు తీసేవాళ్ళం.

కనకాంబరం, బంతి, పట్నం బంతి, చిలకముక్కు, గోరింట, సీతమ్మ వారి జడబంతులు, గుండుమల్లి – ఒకటేమిటి – ఒక దాన్ని మించి మరోటి – గబగబ పందాలు వేసుకొంటూ విత్తులు చల్లేవాళ్ళం.

కనకాంబరం విత్తనాలు కాసిన్ని నీళ్ళు పడగానే చిటపటలాడేవి.

పిల్లలం పక పక నవ్వేవాళ్ళం.

బంతి విత్తనాలు ఎండిన పూలరేకులకు అంటుకొనే ఉండేవి. నారు పోస్తే పూలపానుపే! ఓ మారు సీతమ్మ వారి జడబంతుల విత్తనాలనుకొని తోటకూర విత్తులు చల్లేయలేదూ? తలుచుకొంటే నవ్వొస్తోంది.

ఇక, చేమంతి మొలకల కోసం... మెట్టతామర పిలకల కోసం... మల్లె జాజి అంట్ల కోసం- వీధంతా వేట. పిల్లల సందడి పండుగ సంబరంలా ఉండేది కాదూ?

ఒకరిని మించి ఒకరం కొత్త పూల మొక్కలు నాటాలని ఎంత ఉబలాట పడేవాళ్ళమో!

సబిత వాళ్ళింట్లో ఒకసారి బఠానీ తీగ పాకించేసింది. నిజమే. ఆ ఏడాది వారిదే అందమైన వాకిలి. గులాబి రంగు పూలగుత్తులు తీగలల్లుకుంటూ గేటుమీది చట్రం నుంచి వేళ్ళాడుతూ – అబ్బ ! ఎంత హొయలు పోయేవో!

మరొకసారి సుధవాళ్ళ నాన్న పట్నం నుంచి నీలం రంగు చేమంతులు తెచ్చారు. అది ఎంత వింతో! ఆ మొక్కను నాటిన దగ్గర నుంచీ – చిగురు వేసినా, మారాకు తొడిగినా, మొగ్గవేసినా – ఎనిమిదో వింతలా – అవే గుసగుసల కబుర్లు – పాఠాల మధ్యలో.

మొదటి పువ్వు పూసినపుడు – అబ్బో – అప్పుడు చూడాలి సుధ విరగబాటు! ఎత్తిన గడ్డం దించితేనా!

నిజానికి, ఆ పువ్వును కళ్ళారా చూసిన సంబరంలో సుధ బడికి ఆలస్యంగా వచ్చింది. అదీ సాంఘిక శాస్త్రం తరగతి. భౌగోళిక శాస్త్రంలో పాఠం మొదలయిపోయింది. మా సోషల్ సార్ అసలే తేడా మనిషి!

ఒక బెంచీలో అయిదారుగురం ఇరుక్కొని కూర్చున్నా – కిక్కురుమనకుండా – అటూ ఇటూ కదలకుండా మెదలకుండా – ఆయన చెప్పేవన్నీ తుచ తప్పకుండా వినాలంటారు.

అమెజాన్ నదీ తీరాలు, కాంగో ప్రజల నాగరికత, కలహారి ఎడారి జీవనం – అబ్బో – ఎన్నెన్ని వింతలూ విడ్డూరాలో – బాగానే ఉన్నాయి. కానీ,

మా ముఖాలు చెక్కల్లా బిగించి ఊపిరైనా వదలకుండా బిర్రబిగిసి - చెప్పిన పాఠం వినాలని ఆయన కోరిక!

సతతహరితారణ్యాలు, కాకులు దూరని కారడవులు, ఎడారిలో పూసిన పూలు, టండ్రా భూములు, పచ్చిక మైదానాలు... ఇవ్వన్నీ ఎంత చిత్రంగా ఉంటాయో - ఆశ్చర్యపడకుండా ఎలాగ?

అందులోనూ, సూదిమొనల ఆకులున్న చెట్లు, ఊడలతో మనుషుల్ని జంతువుల్ని మెలేసి తినేసే చీకటి ఖండపు చెట్లు, నరమాంసభక్షకులు - ఇలాంటివి చెబుతోంటే మాలాంటి పిల్లలకు భయం వేయదూ?

ఆయన ధోరణి ఆయనదే!

అదేమిటో, అటు బడి తెరవడం ఇటు పూల మొక్కల కాలం చెట్టా పట్టాలేసుకొని వచ్చేవి. వానాకాలం బడి అంటే అదీ!

పుస్తకాల సంచుల్లో రకరకాల విత్తనాల పొట్లాలు దాచుకొని బడికి తెచ్చేవాళ్ళం. బడికి వెళుతూ బడి నుంచి వస్తూ- ఒకరి ఇంటికి ఒకరం వెళ్ళి - కొత్తరకం మొక్కలు చూసి వచ్చేవాళ్ళం. నచ్చితే ఇచ్చి పుచ్చుకొనే వాళ్ళం. నచ్చకపోతే కచ్చి కొట్టుకొనేవాళ్ళం.

పాపం, మా సుధ! ఆరోజు పంపిన రహస్య సమాచారపు చిట్టీ కాస్తా సోషల్ సార్‌కి దొరికి పోయింది కదా! సుధ ఎంత సంబరంగా పువ్వు పూసిన వార్తను మోసుకొచ్చిందో అంత నీరసంగా బెంచీ ఎక్కి నిలబడింది. ఏం చేస్తుంది మరి?

అదే ఇప్పుడైతేనా -"కాస్తాగండి సార్ - మీ కాంగో కథలకన్నా అమెజాన్ వింతల కన్నా సింధూలోయ విడ్డూరాలకన్నా - గొప్ప విశేషం సుధ పంపిన చిట్టీలో ఉంది! మన ఊళ్ళో మొట్టమొదటిసారిగా నీలం రంగు చేమంతి పువ్వు పూసింది!' అని అనేవాళ్ళం.

ఆ రోజుల్లోనే అనాలని ఉండేది. కానీ ధైర్యం చాలేదికాదు.

సార్ బోర్డువైపు తిరిగి నపుడల్లా - చూపుల బాణాలు విసిరేవాళ్ళం. ఆయన వీపును జల్లెడ చేసేస్తూ - ఉఫ్!

ఆయనకు మాత్రం తెలియదా? అయినా, ఏం పట్టించుకొనే వాడు కాదు. పైనుంచి, నిమ్మళంగా నిదానంగా - ఏ సూయజ్ కాలువ గురించో ఏ మిసిసిపి నది గురించో మరే సహారా ఎడారి గురించో - ప్రశ్నలు అడగడం మొదలు పెట్టేసేవారు.

ఆపై ఏముంది? ఒక్కొక్కళ్ళం వరుసగా బెంచీ ఎక్కేయడమే!

సుధ ఏడుపు కాస్తా మటుమాయం. కిసుక్కున నవ్వింది! చిట్టి చేమంతిలా!

ఆమెకు తోడుగా అందరం బెంచీల మీదే!

బెల్ కొట్టడం ఆలస్యం - అందరం బిలబిలమంటూ నేరుగా సుధ ఇంటికే ప్రయాణం!

నిజమే -

నీలం రంగు చేమంతి పువ్వు.

ఎంత బాగుందో!

అబ్బ!

సుధ ఎంత గర్వంగా తలెగరేసిందో!

కాదు మరీ?

అంత చక్కటి పువ్వు. చిగురాకుల దొంతరలో నీలమణి విరిసినట్లు. ఎంత చక్కటిదో!

ఎవరో పిల్లలు పువ్వు బొమ్మేసి నీలం రంగు నింపేసినట్లు!

ఎప్పుడైనా విన్నామా కన్నామా?

సుధ బడాయిలు పోమంటే పోదా మరి?

పై నుంచి, వాళ్ళ నాన్న ఇంకా ఎన్నెన్నో రకాల చేమంతులు తెస్తానన్నాడట! గడగడ లొడ లొడ చెపుతూనే ఉంది.

ఆమె సంబరానికి ఆమెను వదిలిపెట్టి నేను ఇంటిదారి పట్టాను. నిజం చెప్పద్దూ– పుస్తకాల సంచి ఎక్కడలేని బరువేసింది. ఈడ్చుకొంటూ నిదానంగా వెళుతున్నానా– మా వీధి మూలమీది ఇంటి వాకిలి దాటుతుండగా – కమ్మని వాసన. ఖచ్చితంగా ఏదో పువ్వుదే. చుట్టూ చూశాను. 'ఇంకెక్కడి నుంచి? సైంటిస్ట్ గారింటి నుంచే!'

సైంటిస్ట్ గారంటే వీధిలోని పిల్లలందరికీ చచ్చేంత భయం. ఆయన ఎప్పుడూ ఎవరినీ ఏమీ అనేవాడు కాదు. మధ్యస్తపు ఎత్తు. జేవురు రంగు ముఖం. లావాటి కళ్ళద్దాలు. సైంటిస్ట్‌లంటే పరధ్యానపు మనుషులని అనుకొనేవాళ్ళు అందరూ.

పైనుంచి, ఆయన మాటకారి కాడు. అందుకే ఇరుగూ పొరుగు మాట్లాడించిన పాపాన పోలేదు.

ఇంట్లో ఆడదిక్కున్న ఆనవాళ్ళు లేవు. లేకపోతే అమ్మలక్కలు పేరంటాళ్ళు నోములు అంటూ – చకచక రాకపోకలు చేసేసేవాళ్ళు. ఆ వీధిలోనే ఆయన ఉంటున్నా – పెద్దలకీ పిన్నలకీ – ఓ చిత్రమైన మనిషిలా మాత్రమే పరిచయం.

అయితే మాత్రమేం, ఆ కమ్మని వాసన తనను గేటుదాకా తీసుకెళ్ళింది. అప్రయత్నంగా మెల్లగా గేటు తెరవాలని చూశాను. లోపల నుంచి గడి వేసేసి

ఉంది. చెప్పులు విప్పేసి, పాదాలను నెమ్మదిగా గేటు మీది ఇనుప పూలతీగ లోకి పెట్టాను. గేటుపైని చట్రాన్ని పట్టుకొని లోపలికి తొంగిచూశాను.

గులాబి చెట్టు. అబ్బ... ఎంత పెద్దదో – పొదలాగా పెరిగిపోయి ఉంది. పచ్చటి ఆకుల గుబుర్ల మధ్య గుత్తులు గుత్తులుగా లేత గులాబీపూలు. ఒక్కొక్క పువ్వును ఎవరో పనిగట్టుకుని అమర్చినట్లు.

అంత కమ్మటి వాసన ఆ పూలతావే!

సందేహమే లేదు.

ఆ గులాబి గుబురు చుట్టూ చక్కగా కళ్ళాపి చల్లి ముగ్గేసి ఉన్నారు. ఎంత కళగా ఉందో!

ఇంటి తలుపు గడితీసిన చప్పుడు.

అంతే!

బిక్కచచ్చిపోయాను. భయంతో ఏడ్చేస్తానేమో అనుకున్నాను. గబుక్కున దూకి పరిగెత్తడానికి వీలుకాలేదు. పాదాలు రెండూ ఇనుప పూలతీగల్లో ఇరుక్కుపోయాయి.

చకచక దిగాలన్న ప్రయత్నం ఫలించే లోగానే – తలుపు తెరుచుకోవడం – సైంటిస్ట్‌గారు గుమ్మం బయటకు తొంగిచూడడం – బాబోయి !

కంగారుగా దూకడంలో బొక్క బోర్లా పడడం – మోకాళ్ళు మో చేతులు దోక్కుపోవడం బెక్కుతూ ఇంటి ముఖం పట్టడం – విశాలి కళ్ళముందు 'తనే – చిన్నప్పటి తను – !' విశాలి మెత్తగా నవ్వింది.

" వెంటనే విశాలీ –నీలో నువ్వే నవ్వుకుంటున్నావ్ ?" కాంతి కళ్ళ చివర నుంచే గమనించినట్లుగా అంది.

"ఏం లేదులే..." విశాలి నవ్వింది, "చిన్నప్పటి విషయాలేవో గుర్తొచ్చి!"

" అవును విశాలి... చిన్నప్పుడు కూడా మనిద్దరం ఎప్పుడూ ఇలాగే పోట్లాడుకొనేవాళ్ళం కదా?" కాంతికి కూడా జ్ఞాపకాల తడి తాకింది.

"ఆ...మనం ఒక పూట గొడవ పడకుండా ఉన్నామంటే - అమ్మా నాన్న ఎంత కంగారు పడిపోయేవారో ! ఏం జరిగింది వీళ్ళిద్దరికీ? వంట్లో బాలేదా - అంటూ !"విశాలి నవ్వేసింది కాంతితో పాటుగా.

"వి ఆర్ హోమ్!" కాంతి ఉత్సాహంగా ప్రకటించేసింది.

కార్ పార్క్ చేసి, సామాను దింపుతూ ఉండగా - కాంతి సెల్ ఫోన్ మోగింది.

అది ఏ వార్త మోసుకొచ్చిందో కానీ, కాంతి ముఖం వెలవెల బోయింది. కళ తప్పింది. అప్పుడే దించిన సూట్‌కేస్‌పై దబ్బున కూలబడింది. ఒక్కసారిగా.

విశాలి ఆశ్చర్యంగా చూసింది.

ఫోన్‌లో కాంతి ఆ.. ఊ... లు తప్ప మరో మాట మాట్లాడడం లేదు.

"ఓ కే... ఐ విల్ గెట్ బ్యాక్ టు యూ - థాంక్స్ ఫర్ ద కాల్ !"

ఫోన్ మాట్లాడడం ఆపేసినా కాంతి అలాగే కూర్చుండిపోయింది. ఏదో దిగ్భ్రాంతికి గురయినట్లుగా. మోకాళ్ళ మీద అరచేతుల్లో ముఖాన్ని దాచుకుంది.

విషయమేమైనా చెపుతుందేమోనని విశాలి ఓ క్షణం ఎదురుగా నిలబడి చూసింది.

ఊహు!

విశాలి నెమ్మదిగా వెనక్కి తిరిగింది. కారులో మిగిలిన సామానును నెమ్మదిగా కిందికి దించడం ప్రారంభించింది ఒక్కొక్కటిగా.

సవ్వడి కానివ్వకుండా కారు తలుపు వేసి కాంతి ఎదురుగా వచ్చి నిల్చుంది.

కాంతి భుజాలు ఎగిరెగిరి పడుతున్నాయి. కుమిలి పోయి ఏడుస్తు న్నట్లుగా.

అలాంటి ప్రమాదమేమీ జరగలేదుకానీ, దాదాపు అలాగే ఉంది కాంతి పరిస్థితి. ముఖం పీక్కుపోయింది, ముక్కు ఎగబీలుస్తోంది. అంతా అరక్షణంలో!

'అరరే- ఏమయిందబ్బా?' విశాలి వింతపడింది.

"కాంతీ..." విశాలి గబుక్కున ఆమె ముందు కూలబడింది, "ఏం జరిగింది?" కాంతి భుజాన చేయివేసింది విశాలి.

"సారీ విశాలీ... నువ్వు మొదటిసారి వచ్చినప్పుడే - నేను ఇలా-" కాంతి కాస్త కూడ దీసుకుంది.

"ఫర్వాలేదు. అయినా, ఈ అర్ధాంతరపు మర్యాదలు మనకు ఎందుకు కానీ, ఏం జరిగింది?"

"బిందు -"

"ఆ- మన హిమబిందేనా-" గబుక్కున అనేసింది విశాలి.

'ఎవరైనా మాట్లాడుతుంటే మధ్యలో అడ్డుపడకూడదు-' విమానం దిగగానే తన చెల్లి బోధించిన అమెరికా సూత్రం నంబర్ వన్! అంత బాధలోనూ తన వంక చురచుర చూస్తుంటే- విశాలికి నవ్వొచ్చింది. 'పొరపాటున నవ్వేసానా - అంతే సంగతులు! ఎవరితోనైనా పెట్టుకోవచ్చుకానీ- చిట్టి చెల్లితోనా? అమ్మో!' విశాలి ఊపిరి పీల్చి వదిలింది.

"-సారీ, కాంతీ-" విశాలి సంజాయిషీ ఇచ్చేసింది గబుక్కున.

"ఇట్సోకే!" కాంతి ముక్కు ఎగబీల్చింది. ఆ వేగంలోనే జుట్టును పైకి నెట్టేసింది.

"ఈమె బిందుమాధవి. ఇక్కడ అడుగు పెట్టినప్పటి నుంచీ ఎంత అండగా ఉండేదో- ఎంత ధైర్యంగా ఉండేదో-" మౌనంలోకి వెళ్ళిపోయింది కాంతి.

ఆమె మాటలు నిశ్శబ్దమవడం - చూపులు శూన్యం కావడం చూసి విశాలి చొరవగా అడిగింది - "ఇప్పుడే మయింది కాంతీ - అది చెప్పు ముందు."

"ఏం లేదు. నేను అర్జంటుగా ఆఫీసుకు వెళ్ళాలి. నీ గురించే భయమంతా. వచ్చీ రాగానే వంటరిగా వదలి వెళ్ళాల్సి వస్తోందని. నేను రావడానికి ఆలస్యం కావచ్చు-" కాంతి కాస్తాగి మళ్ళీ అంది, "సారీ, విశాలి నువ్వొచ్చిన రోజే-"

"భలేదానివే - అవతల నీకు ముఖ్యమైన పని ఉంటే-" విశాలి కాంతి భుజాన తట్టింది, "ముందు బయల్దేరు."

విశాలి ఒక్కో సామాను ఇంట్లోకి చేర్చేలోగానే - కాంతి కాఫీ గట్రా ఎలా కలుపుకోవాలో చెపుతూనే బోలెడన్ని రక్షణ సూత్రాలు, నియమ నిబంధనలు బోధించేసింది. మధ్యే మధ్యే - అమెరికా మర్యాదల సూత్రావళిని వల్లించేసింది.

"- ఇక నేను బయలుదేరుతాను. ముందు తలుపు తాళం వేసుకెళతాను. సెక్యూరిటీ అలారం ఆన్ చేశాను. ముంగిట్లో పాదాల చప్పుడు వినిపించినా పోలీసు వారికి తెలిసిపోతుంది. భయం లేదులే - అయినా జాగ్రత్త! ఇదుగో నా ఫోన్ నెంబర్. ఇక్కడ రాశా. బైదవే 911 గుర్తుంది కదా -"

"కాంతీ, ముందు నువ్వు బయలుదేరు. నా గురించి బెంగ పడద్దు -" విశాలి నవ్వుతూనే అంది.

"బై - టేక్ కేర్ - సీ యూ - సారీ" -కాంతి వెళ్ళిపోయింది.

విశాలి చుట్టూ ఆకస్మాత్తుగా చీమ చిటుక్కుమనేంత నిశ్శబ్దం.

తల దిమ్మెక్కి పోయేట్లుగా ఉంది. తల విదిలించి చుట్టూ చూసింది విశాలి.

ఇల్లంతా చక్కగా తీర్చి దిద్దినట్లుగా ఉంది. మధ్యలో ఎటూ ఇమడని తన సామాను. 'అమ్మ చూస్తే ఎంత సంతోషపడుతుందో! తిన్న కంచం తీయడం రాని కాంతి, పుస్తకాల సంచి సర్దుకోవడం చేతకాని కాంతి - ఇంత బుద్ధిమంతురాలైందంటే అమ్మ మురిసిపోదూ మరి!' విశాలి ముఖాన చిరునవ్వు కదలాడింది.

చక్రాల సూట్‌కేస్‌లను బ్యాగ్‌లను తనకు కేటాయించిన గదిలోకి తీసుకువెళ్తుంటే - గుర్తొచ్చింది.

'అరరే - కాంతికి ఇద్దామని ఆమ్‌స్టర్ డాం లో కొన్న తులిప్ పూలగుత్తి - అలాగే ఉండి పోయిందే - అబ్బ - ఒకటే మతిమరుపు!' విశాలి గొణుక్కుంది,' బ్యాగ్‌లో ఏ పక్కన పడిపోయిందో! చివరి నిమిషంలో అంతా హడావిడి. కస్టమ్స్ చెక్ లో ఎలాంటి ఇబ్బంది రాలేదు కానీ, అగ్రికల్చర్ చెకింగ్ చేసేటప్పుడు సామానంతా క్షుణ్ణంగా చూశారు.

ఆమ్‌స్టర్‌డాం నుంచి తులిప్ దుంపలు కూడా తీసుకువచ్చింది. ఆ ఆఫీసర్ ఏ కళన ఉన్నాడో చక్కగా తీసి పక్కన పెట్టాడు. "నాట్ అలౌడ్" లిస్ట్ రాసిన బోర్డు అతని వెనకే వేళ్ళాడుతోంది. అయినా ఆ లిస్ట్‌లో వీటి ప్రస్తావనే లేదు. ఆమ్‌స్టర్‌డాంలో చేసిన ప్యాకింగ్ కాబట్టి ఏ ఇబ్బంది ఉండదనే అనుకుంది.

ఆఫీసర్ ముఖం కందగడ్డలాగా కాదు కాదు బీట్రూట్‌లా బాగా ఎరుపెక్కి ఉంది. కోపమో మరేమిటో తెలియదు.

'సరే, పోతే పోనీలే -' అని అనుకుందామంటే - అంత ఖరీదు పెట్టి కొని ఇలా వృథాగా వదిలేయడం - పైనుంచి, ఇక ఆ దుంపలు నాటడం, మొక్కలు పెరగడం, పువ్వులు పూయడం - అన్నీ అసాధ్యం!' ఉసూరుమనిపించింది విశాలికి. 'చేజేతులా హత్య!'

బయలుదేరడానికి ముందు కాంతి ఫోన్‌లో ఇచ్చిన వార్నింగ్‌ల అలారం విశాలి తలలో మోగింది. ఓ బలవంతపు నవ్వు పెదాల మీదకి తోసి, సూట్‌కేస్‌లను ట్రాలీల మీదకెక్కించుకొని బయటపడింది. 'ఏం చేయగలను? సోదరి ఆజ్ఞ. ఎవరితో ఎటువంటి వాదోపవాదాలకు దిగవద్దని. వాళ్ళు పాస్‌పోర్ట్ మీద దభీమని ముద్ర కొట్టే దాకా – కిక్కురుమనవద్దని, ముద్ర కొట్టేశాక అటూ ఇటూ చూడకుండా తల దించుకుని తిన్నగా వచ్చేయమని.'

పొల్లు పోకుండా అలాగే చేసింది విశాలి.

అలా వచ్చేసరికి ఎదురుగా కాంతి. అద్దాల్లోంచి ఆదుర్దాగా ఎదురు చూస్తూ.

"చాక్లెట్లు నింపిన ఈ ప్లాస్టిక్ తులిప్ పూల గుత్తినైనా అనుమతించారు–" విశాలి నిట్టూర్చింది. ఆ పూలగుత్తిని టీపాయి మీద పెట్టింది. ఏ మాటకామాట చెప్పుకోవాలి అవి అసలు సిసలు పూలలాగానే ఉన్నాయి. అరవిచ్చి. అందంగా.

అరిసెలు ఆవకాయల రూపంలో ఉన్న అమ్మ తాలూకు ప్రేమను సూట్‌కేస్ లోంచి వంటింటి అల్మేరాలలోకి రవాణా చేసింది విశాలి.

తిరిగి గదిలోకి వచ్చింది. మంచం చూడగానే ఎవరో వశీకరణ మంత్రం వేసినట్లుగా – ఒక్కసారిగా మైకం కమ్మినట్లుగా – నిద్ర.

మెత్తటి పరుపు మీద బొక్కబోర్లా పడిపోయింది.

అదాటున లేచి చూసేసరికి, ఇంకా కాంతి వచ్చిన అలికిడి లేదు. చుట్టూ నిశ్శబ్దం. గదినిండా ఎక్కడ వేసినవి అక్కడే పడి ఉన్నాయి.

తెరిచి ఉంచిన సూట్‌కేసులు. జిప్‌లు వేయని బ్యాగులు. తొంగి చూస్తోన్న బట్టలు, వస్తువులు.

విశాలి గబగబ అటూ ఇటూ సర్దేసింది.

కిటికీ దగ్గరకి వెళ్ళి బైండర్స్ తెరిచేసింది. వెలుతురు ఒక్కసారిగా ఇంట్లోకి -ప్రవేశించింది. తలుపులు తెరిస్తే గాలి కూడా వస్తుంది. కానీ, కాంతి చెప్పి వెళ్ళింది. అలాంటి ప్రయత్నాలు పొరపాటున కూడా చేయవద్దని.

విశాలి అటూ ఇటూ ఇంట్లోనే బొంగరంలా తిరిగింది.

కాంతి వాళ్ళాయన లేడు. ఊరెళ్ళాడు. ఆయన ఉన్నా కాస్త కబుర్లతో కాలక్షేపం అయ్యేది.

కాంతి ఫోటోలు రకరకాల ఫ్రేముల్లో. గోడల మీద. అల్మేరాల్లో. టేబుళ్ళపై.

టివిపై పెట్టిన కాంతి గ్రాడ్యుయేషన్ ఫోటో ఎంత కళగా ఉందో!

'ఇప్పుడంటే ప్రపంచం ఓ కుగ్రామం. కానీ, కాంతి బయటకు బయలుదేరినప్పుడు ఎన్ని భయాలో! పల్లెలో పుట్టి పాలమూరులో పెరిగి - పట్టుదలతో ఇక్కడి దాకా ప్రయాణించింది. మొత్తానికి అనుకున్నది సాధించేసింది!' విశాలి ఫోటోను మునివేళ్ళతో తడిమి భద్రంగా టివి మీద పెట్టేసింది. మురిపెంగా.

విశాలి తలంతా భారంగా ఉంది. ఏమీ తోచనీయకుండా. ఇంత దూరప్రయాణం చేసి వచ్చాక, తీరికగా విశ్రాంతి తీసుకుందామన్నా వీలు కావట్లేదు. ఎందుకో ఊపిరి ఆడడం లేదు. కొట్టుమిట్టాడుతున్నట్లుగా ఉంది.

గోడలు. చుట్టూ గోడలు.

కిటికీలు ఉన్నా - అద్దాలు నిలువుగా బిగించేసి ఉన్నాయి.

తలుపులు ఉన్నా - గడియలు తాళాలు వేసేసి ఉన్నాయి.

విశాలి ఇల్లంతా చుట్టేసింది. మళ్ళీ మళ్ళీ.

కిచెన్ లో బే విండో !

తెరిచే ఉంది.

విశాలి గడి కదిలించి చూసింది. చులాగ్గా వచ్చేసింది.

కిటికీ అవతల చిన్న లాన్. చుట్టూ పూలమొక్కలు.

విశాలికి ప్రాణం లేచొచ్చింది. కిటికీలోంచి బయటకు వచ్చేసింది.

చల్లటి గాలి. ఊపిరి తిప్పుకున్నట్లయింది. పచ్చిక మీద పచార్లు చేస్తూ పూలమొక్కలు తడిమి చూడసాగింది. సాయంకాలం నీరెండ. వింత వన్నెలద్దింది.

అదాటున గుర్తుకు వచ్చింది విశాలికి.

అక్కడ పూసిన పువ్వు!

లేత గులాబి పువ్వు.

విశాలి ముఖాన చిరునవ్వు కదలాడింది.

'కాంతి వచ్చేలోగా ఓ మారు చూసి వస్తే –' విశాలికి ఎక్కడలేని హుషారు వచ్చేసింది.

'ఇంకా చీకటి పడలేదు. చుట్టూ వెలుతురు. అలా నడక సాగిస్తే మంచిది. రాత్రికి కునుకన్నా పడుతుంది. లేకపోతే రాత్రంతా జాగారమే–'

అంతే, విశాలి బేవిండో లోంచి మరోసారి ఇంట్లోకి దూరేసింది. ఓ స్టికాన్ పేపర్‌పై వాక్ కి వెళుతున్నానని రాసేసి – ఫ్రిజ్ పై అతికించేసింది. కాంతి చెప్పి వెళ్ళినట్లుగా.

జర్కిన్ తగిలించుకొంది. నడక దారి పట్టింది.

జాగ్రత్తగా ముందు గుమ్మం వైపు వెళ్ళకుండా – సెక్యూరిటీ కెమెరాల కంట్లో పడకుండా – మెత్తగా నడుస్తూ – వీధిలోకి వచ్చేసింది!

ఇదేదో చిన్న పిల్లల అద్భుత సాహస కార్యంలా ఉంది!

విశాలి నవ్వుకుంది. కీలుగుర్రం లో రాకుమారుడిలాగా - కుడివైపు తప్ప ఎటైనా వెళ్ళమంటే కుడివైపే వెళ్ళినట్లు - కాంతి చెప్పిన సూత్రావళిని ఇంటి ఫెన్సింగ్ కు తగిలించేసి - కులాసాగా నడవసాగింది. బైకర్స్ పాత్ మీదుగా.

అక్కడ పువ్వు గుర్తుకు రాగానే విశాలికి అలనాటి జ్ఞాపకాలు ముంచెత్తాయి.

మొట్టమొదటి సారి విదేశీయుల్ని చూసింది కూడా గులాబిపువ్వు మూలంగానే. తను కాంతిని వెంటబెట్టుకొని సైంటిస్ట్ గారింటికి గులాబీలు చూడడానికి వెళ్ళిందే - సరిగ్గా అప్పుడు.

ఏ మాట కా మాట చెప్పుకోవాలి. కాంతిది కాస్త గట్టి గుండె.

గేటు చప్పుడుకు సైంటిస్ట్‌గారు తలెత్తి చూడగానే - తను బిక్కచచ్చి పోతే - కాంతి చక్కగా "నమస్తే" అంటూ పలకరించింది.

ఆయన కూడా ఆ పూట కాస్త కులాసాగానే కనిపించాడు. తమ ఇద్దరినీ దగ్గరికి రమ్మని పిలిచాడు.

ఆయన ఎదురుగా విదేశీయుల జంట. చెవులదాకా కత్తిరించిన ముదురుగోధుమ వన్నె జుట్టుతో ఆమె ఎంత ముచ్చటగా ఉందో! పసిరిక పాము వన్నెలోని కళ్ళు. మోకాళ్ళ దాకా ఉన్న గౌను. ఎంత చిత్రంగా ఉందో!

మేమిద్దరం అప్రయత్నంగా మా వైపు చూసుకున్నాం.

ఆటల్లో మట్టికొట్టుకున్న మా పొట్టి లంగాలు. రిబ్బన్లతో బిగించి పైకెత్తి కట్టిన జడలు. అసంకల్పితంగా నా లంగాను కిందికి లాక్కున్నా. నిన్న గేటు మీద నుంచి పడినప్పుడు మోకాళ్ళు దోక్కుపోయాయి కదా...వాళ్ళు చూస్తే నవ్వుతారేమో! వాళ్ళు ఇంగ్లీషులో ఏవో అడుగుతూ ఉంటే కాంతి చటపట

సమాధానాలు చెప్పేస్తోంది. నా గొంతులో ఏదో దిగబడ్డట్లు నాలుక బిగుసుకు పోయింది. మాట పెగలడం లేదు. బిత్తరచూపులు చూస్తూ గులాబి గుబురుపై దృష్టి నిలిపాను.

దగ్గరగా చూస్తుంటే ఆ గులాబి ఇంకెంత బావుందో -

సైంటిస్ట్ గారు కాంతిని మెచ్చుకొన్నారు. ఎంత చలాకీ అమ్మాయివి - అని. అతిథుల వైపు కూడా తిరిగి ఏదో మాట్లాడారు. ఆ తరువాత మమ్మల్ని నెమ్మదిగా అడిగారు,

"మీరు బడి వదిలాక ఏం చేస్తారు?"

"ఏం లేదు! అటూ ఇటూ తిరుగుతాం. చోరాట, కుంటాట ఆడుకుంటాం. గోళీలు ఆడుతాం. సైకిల్ తొక్కుతాం. పతంగులు ఎగరేస్తాం." కాంతి ప్రసన్నంగా చెపుతోంది.

ఇక నాకు ఉక్రోషం ముంచుకొచ్చింది. కాంతినే అందరూ మెచ్చుకోవడం చూసేసరికి. బెరుకు ఎటుపోయిందో - మెల్లిగా గొంతు విప్పాను -"కొత్త కొత్త మొక్కలు పెంచుతాం"

"ఈజిట్!" తెల్ల దొరసాని జుట్టు కదిలేలా ఆశ్చర్యపోయింది.

"యస్!" నేనూ ధీమాగా అన్నాను.

"ఏవేం మొక్కలు? ఎక్కడ తెస్తారు? ఎలా వేస్తారు?"

"తోటల్లో తిరుగుతాం. గుట్టల్లో వెతుకుతాం. ఇంటింటికి పోతాం. ఎక్కడెక్కడ కొత్త మొక్కలుంటే అన్నీ తెచ్చేసుకుంటాం. మా పల్లె నుంచి బోలెడన్ని విత్తనాలు, అంట్లు, పిలకలు, మొలకలు - అన్నీ తెచ్చి నాటేసుకుంటాం -" వాళ్ళ చిరునవ్వుల ముఖాలు చూసేసరికి - నా ఉత్సాహం పెరిగిపోయింది.

కాంతి కూడా మాటలో మాట కలిపింది.

"మా దగ్గర నీలం రంగు చేమంతి పువ్వు కూడా ఉంది –"

అదే అదను అన్నట్లుగా – గబుక్కున అడిగేశాం – ఇద్దరం ఒకేమాటగా – "అదుగోండి – ఆ గులాబి కొమ్మ అడగడం కోసం మీ ఇంటికి వచ్చాం!"

వాళ్ళందరూ ఫక్కున నవ్వారు.

"అలాగే తీసుకొండి" సైంటిస్ట్ గారు మాట ఇచ్చేశారు, "మాకో సాయం చేస్తారా?"

"ఓ!" ఇద్దరం ముక్త కంఠంతో మాట ఇచ్చేశాం. గులాబీ కొమ్మలు దొరుకుతున్నాయన్న పరమానందంలో మరో మాట ఏం మాట్లాడగలం?

"ఆ అంకుల్ ఆంటీ లకు కూడా మీలాగే కొత్త కొత్త రకాల మొక్కలంటే ప్రాణం. మీకు దొరికిన విత్తులు, పిలకలు, దుంపలు, మొక్కలు వీరికి తెచ్చిస్తారా? నిజానికి, వాళ్ళకి వేప, కరివేప, పిచ్చిబీర – అన్నీ కొత్తవే. కలబంద, సీతాఫలం, నవరత్నాలు – ఏవైనా సరే –"

"మన పాలమూర్లో విత్తులకు కొదువా? మొక్కలకు కొదువా? అలాగే తెచ్చిస్తాం –" కాంతి ముఖం కళకళలాడిపోయింది.

ఈ రూపేణా చెరొక గులాబి కొమ్మ మా చేతుల్లోకి వచ్చాయి.

మారేడు , అత్తి, పత్తి – నుంచి కలుపు మొక్కలు, పిచ్చి మొక్కలు – మల్లెలు, జాజులు, మరువం, దవనం, గోరింట, ముళ్ళ గోరింత – ఒక్కటేమిటి – రోజూ బడి వదిలాక మా కంట్లో పడిన ప్రతి మొక్కనూ, విత్తును సైంటిస్ట్ గారింటికి తీసుకెళ్ళి ఇచ్చేసేవాళ్ళం.

గుట్ట, మిట్ట, పుట్ట – అన్నీ వెతికి వదిలేసాం.

చేను, గట్టు, డొంక  - అన్నీ శుభ్రంగా తిరిగేసాం.

ఆ దొర, దొరసాని ఎంత మెచ్చుకొనేవారో - సైంటిస్ట్ గారు అంత ముచ్చటపడేవారు. మాకు మ్యారీ బిస్కట్టో, కేకుముక్కో ఇచ్చేవారు. అప్పుడప్పుడు ఆపిల్ ముక్కలు.

అమ్మ ఎన్ని మార్లు  చివాట్లు పెట్టిందో  ఇళ్ళ మీద పడి తినవద్దని - అమ్మ ఏం అంటుందో అని తను భయపడుతోంటే - కాంతి ఎంచక్కా తన వంతు కూడా తినేసింది!'

విశాలి ముఖాన చిరునవ్వు కదలాడింది.

జ్ఞాపకాల ఊపులో దూరం తెలియలేదు. చూస్తూ ఉండగానే గుమ్మం వచ్చేసింది. సరిగ్గా ఆ మలుపు మీదున్న ఇంటి ముందే తను గులాబీ గుబురును చూసింది.  నడకసాగింది.

'సైంటిస్ట్ గారింటి నుంచి తెచ్చుకొన్న ఆ గులాబీ కొమ్మలను తనూ కాంతి ఎంత బాగా చూసుకొన్నారో! ఖాళీ అట్టపెట్టెల్లో మట్టి నింపేసి - కొమ్మల్ని ఏటవాలుగా నాటేసారు. ఆకులు చెలిగేసి -కొమ్మ చివర పేడ ముద్ద పెట్టారు. 'అలాగయితే తొందరగా చిగురు వేస్తుంది' అంది అమ్మ.

కాచి వడబోసిన టీ పొడి, కోడిగుడ్డు పెంకులు, చేపముళ్ళు - ఇద్దరం పోటీ పడి సంపాదించేవాళ్ళం. వీధిలో ఎవరింట్లో అట్టు వేసిన వాసన వస్తే అక్కడికి పరుగులు తీసేవాళ్ళం. ఒక రోజు చెత్తకుండీ దగ్గర కోడిగుడ్డు పెంకులు ఏరుతోంటే -అమ్మ దొరక బుచ్చుకొని వీపు చిట్ల గొట్టింది!

ఇంకా నయం, వెనుక వీధి విజయాంటీ వాళ్ళింట్లో చేప పొలుసుల కోసం - ఇద్దరం పోటీలు పడి - బూడిదతో చేపలు తోమిన సంగతి తెలిసివుంటే - అమ్మ చంపేసేది! అవన్నీ తనకు కాంతికి మధ్య దాగిన రహస్యాలు.

మొదట కాంతి నాటిన కొమ్మ చిగురువేసింది. మొదటి మొగ్గ తొడిగింది మాత్రం తన కొమ్మ. పువ్వు విచ్చింది కాంతి కొమ్మపై.

'బావుంది మీ వ్యవహారం !' సుధ వాళ్ళంతా బుగ్గలు నొక్కుకున్నారు.

చివరకు, పూలు చూపించే హడావుడిలో –కాంతి తరగతి అమ్మాయిలు తమ తరగతి అమ్మాయిలు కలిసి – రేకలన్నీ ఎగరకొట్టారు. తొడిమలు మిగిలిపోయాయి.

ఎంత నవ్వుకున్నారో ఆ తరువాత –'

విశాలి నవ్వుకుంటూనే గులాబీ గుబురు దగ్గరకు వచ్చేసింది.

'అవును. అచ్చం ఇది సైంటిస్ట్ గారింటి గులాబీ చెట్టు లాగానే ఉంది. గుత్తులు గుత్తులుగా పూలు. ఎవరో శ్రద్ధగా సున్నితంగా ఆకుల పొత్తిళ్ళలో అమర్చినట్లుగా. ముగ్ధమనోహరంగా.

తనకు ఆ మొక్కకు నడుమ ఇనుప తీగలు అలలు అలలుగా.

విశాలి పైకి నవ్వేసింది.

'అవును. అదే ఆఖరుసారి తనూ కాంతి గులాబిని చూడడం. ఒక రోజు బడి నుంచి వచ్చేసరికి ఇద్దరి మొక్కలు మేకలకు ఫలహారమై పోయాయి. ముందూ వెనుక తేడాల్లేకుండా. చేమంతి, బంతి, మరువాలతో సహా.

కాంతీ తను ఎంత ఏడ్చారో!

ఆ మొక్కల కోసం ఎన్నెన్ని కష్టాలు పడ్డామో గుర్తొచ్చింది. గుట్టలెక్కి పుట్టలెక్కి – ముళ్ళల్లో కంపల్లో – రాళ్ళల్లో రప్పల్లో – వాగుల్లో వంకల్లో – వెతికి వెతికి ఎన్నెన్ని మొక్కలు సేకరించి ఇచ్చామో –ఆ సైంటిస్ట్ గారి చుట్టాలకి.

'ఇప్పుడు మళ్ళీ వెళ్ళి అడిగితే , గులాబీ కొమ్మలు ఇస్తారా? అవి మళ్ళీ చిగురిస్తాయా? మళ్ళీ పూలు పూస్తాయా?' చిట్టి బుర్రల్లో ఎన్ని సందేహాలో!

కాంతి తనూ గోడచాటున నక్కి తెగ ఏడ్చాం. అమ్మకు తెలియకుండా. రహస్యంగా. సైంటిస్ట్ గారు 'మొన్న తీసికెళ్ళిన కొమ్మలు ఏం చేశారంటే -?' భలే ఏడుపు వచ్చింది. బిక్క చచ్చిపోయినట్లయింది.

చివరకు ఒక నిర్ణయానికి వచ్చాం. ఏమైతే అయ్యిందని.

సైంటిస్ట్ గారిని కలిసి కొమ్మలు ఇమ్మని అడుగుదాం - అనుకొన్నాం. ఇద్దరం ధైర్యం పుంజుకుంటూ.

అడుగులో అడుగేసుకొంటూ - ఒక్కో మాట నోట్లో నానుస్తూ వారింటి గేటు దగ్గరకు వెళ్ళి నిల్చున్నాం. ఇద్దరికీ ధైర్యం చాల్లేదు. నువ్వంటే నువ్వనుకొని - చివరికి  ఎవరిని ఎవరం తోసామో - గేటు మీద దబ్బున పడడంతో - అది కాస్తా బార్లా తెరుచుకుంది. ఎదురుగా ఎండిపోయిన ముళ్ళకంప లాంటి గులాబి గుబురు !

ఇద్దరం నిర్ఘాంతపోయాం. నోరు తడారిపోయింది. ముఖాలు మార్చి మార్చి చూసుకొన్నాం.

"సైంటిస్ట్ గారు లేరు. ఏమైనా పనుందా?" ఆ ఇంటి వంటమనిషి అడిగాడు.

గులాబి గుబురుపై నుంచి కళ్ళు కదల్చకుండా తల అడ్డంగా ఊపాం.

వంట మనిషి కూడా  తలను అటువైపే తిప్పాడు. యథాలాపంగా అన్నాడు "సైంటిస్ట్‌గారు ఇంటికి వచ్చేలోగా చెట్టు మొదలంటా తీయించేయ మన్నారు. కొట్టేయాలి."  మళ్ళీ ఆగి అన్నాడు, "ఏదో మాయదారి మందు తెచ్చి వేశారు.

నిలువునా మాడిపోయింది. ఆ దొరలు తెచ్చిచ్చారు. పూలు విరగ పూస్తాయన్నారు. ఏకంగా తల్లి వేరే తెగింది. ఫ్చ్!"

వంటమనిషి మాటలు సగం అర్థమయ్యాయి. సగం కాలేదు. అయినా ఇద్దరం తలాడించి వెనక్కి మళ్ళాం.

అదే చివరిసారి. ఇప్పుడు మళ్ళీ అదే గులాబీ గుబురు. తన కళ్ళ ఎదురుగా, కళకళలాడుతూ. సరిగ్గా భూగోళానికి అటువైపు తమ ఊరు! అక్కడ మాయమై ఇక్కడ ప్రత్యక్షమైనట్లు – అచ్చంగా అదే!

విశాలి నిట్టూర్చింది.

"చేయి చాస్తే అందేంత దగ్గరగా. సరిగ్గా అడుగు దూరంలో!

ఎన్నాళ్ళుగా వెతికింది – ఎక్కడెక్కడ వెతికింది – ఈ మొక్క దొరికితేనా? ఎన్నెన్ని రంగుల్లో ఎన్నెన్ని రకాలో – మార్కెట్‌లో నర్సరీలలో – కానీ, ఈ నాటు గులాబీ – మళ్ళీ ఇన్నాళ్ళకు – ఇలా – ఓహ్! అద్భుతం!'

విశాలి నెమ్మదిగా ముందుకు కదిలింది. ముళ్ళ కంచెను తొలగించాలని ప్రయత్నించింది. అలా చేయి ఇనుప వలపై పడిందో లేదో – టక్కున ఆపేసింది,

"విశాలీ!" అంటూ కాంతి పెట్టిన పొలికేక.

విశాలి నవ్వుతూ వెనక్కి తిరిగింది. తన ముఖం తనకే కనబడసాగింది. చిత్రంగా. చిన్నప్పుడు సైంటిస్ట్ గారి గేటు మీద నుంచి తొంగి చూస్తూ వెలిగిపోయినట్లుగా. వాళ్ళ తలుపు శబ్దం వినగానే బిక్కచచ్చిపోయినట్లుగా.

"ఏం చేస్తున్నావ్ విశాలీ – చూడక్కడ – ఆ బోర్డును చూడు!"

చూసింది విశాలి.

"ట్రెస్‌పాసర్స్ విల్ బి ప్రాసిక్యూటెడ్ –"

"అనుమతి లేనిదే ప్రవేశించిన వారు శిక్షార్హులు –"

"అంతేనా?"

"ఏం ఇంటికి భద్రంగా చేరాలని లేదా చెప్పు – ఎందుకిలా విసిగిస్తున్నావ్? అసలు ఎన్నెన్ని చెప్పి వెళ్ళాను. అన్నీ పెడచెవిన పెట్టి ఇలా తిరిగేయడమేనా? చిన్నపిల్లలా! ఎవడన్నా పోలీస్‌కి కాల్ చేసి ఉంటే – ?!" కాంతి గబగబ అంటోంది.

విశాలికి నవ్వొచ్చింది. చరిత్ర పునరావృతమవుతోందని! 'అమ్మ పాత్రలో చెల్లి! అచ్చం అమ్మ లాగానే నడుం మీద చేతులు పెట్టుకొని తల ఎగరేస్తూ – ఇక తన ముఖం –అచ్చం బెంచీ మీద నిలబడ్డ సుధలాగా!

"ఇక్కడ ప్రాణాలు పోతోంటే నీకు నవ్వొస్తోందా?" కాంతి గొంతులో ప్రకంపనాలు.

కాంతి ముఖంలోకి తేరిపార చూసీ చూడగానే – ఒక్కసారి గులాబీ మైకం వదిలింది విశాలికి. 'ఛ! కాంతి హడావుడిగా వెళ్ళింది. ఏ సమస్యలో ఉందో – తనేమిటి ఇలా తన గోలలో తను పడింది!'

"కాంతీ – ఏం జరిగింది" విశాలి బిగ్గరగా అంది.

కాంతి పెదవి బిగించి, తల వాల్చింది.

విశాలి గబుక్కున కాంతి దగ్గరకు వెళ్ళింది.

"షి వజ్ ఆన్ బెంచ్!" కాంతి ఎలాంటి భారం లేని గొంతుతో అంది.

'సుధ బెంచిపైకెక్కిన విషయం తను తలుచుకొంటుంటే – కాంతికి ఎలా తెలిసింది!' ఆశ్చర్యపోవడం విశాలి వంతయింది. అందుకే అడిగింది,

"కాంతీ - నీకెలా తెలుసు?"

"అందరికీ తెలుసు. తనకీ తెలుసు. తెలిసినప్పటి నుంచే లోలోన కుంగిపోయింది. ఎంత తాపత్రయపడేదో తనే కంపెనీ అన్నట్లుగా. అంతగా మమేకమై పోయింది. ఎంత మంది ఉద్యోగస్తులు వచ్చారో వెళ్ళారో - తను మాత్రం కంపెనీనే కనిపెట్టుకొని ఉంది. కంటిపాపలా చూసుకొనేది. అనుక్షణం. ఇప్పుడు కంటిలో నలుసై పోయింది. ప్చ్!" కాంతి గొంతు గద్గదమై పోయింది.

'కంపెనీ.. కంటి నలుసు' విశాలికి అర్థమై పోయింది. 'కాంతి ప్రస్తావించేది సుధ గురించి కాదు. ఫోన్ రాగానే హడావిడిగా వెళ్ళిందిగా - అక్కడ ఏం జరిగిందో!' విశాలి నెమ్మదిగా కాంతి ఎదురుగా వచ్చి నిలబడింది. ఆ మాటే అడిగింది.

"బిందు ఎప్పటి లాగానే ఆఫీస్‌కు వచ్చిందట. ప్రతి ఒక్కరినీ నోరారా పలకరించిందట. అన్ని పనులు తన కొలీగ్స్‌కి అప్ప చెప్పిందట. ఆ తరువాత ...తన సీట్లోనే...ఏవో మాత్రలు మింగి....." కాంతి వెక్కిళ్ళు పెట్టసాగింది, "మేం వెళ్ళే సరికే అంతా అయిపోయింది -"

విశాలి నిర్ఘాంత పోయింది. ఇలాంటి వార్త వినాల్సి వస్తుందనుకోలేదు. ఎట్లో తేరుకొని అడిగింది. "ఎందుకని!"

"ఉద్యోగం లో నుంచి తీసేయబోతున్నారని!"

"ఏం చేసిందని?"

"ఏమీ చేయలేదు. ఎప్పుడు బెస్ట్ ఎంప్లాయే. కంపెనీలో చేరి చాన్నాళ్ళయిందని. అది కంపెనీకి మంచిది కాదని. బోర్డు ఆ నిర్ణయం తీసుకొంది. ఫూల్. వట్టి ఫూల్. ఈ రోజుల్లో ఇంత సున్నితమైన వాళ్ళుంటారా? తన అనుభవానికి ఎంత మంచి అవకాశాలు దొరికేవి - అనవసరంగా -"

కాంతి కళ్ళు ఉబ్బి పోయి ఉన్నాయి. మాటలు ఆగి ఆగి వస్తున్నాయి. "ఎక్కడైనా అనుబంధం పెంచుకొనే అవకాశం కానీ, మమేక భావన తో పెనవేసుకొనే సందర్భం కానీ ఉంటుందా? ఊహు! పనంటే పని! అంతే! ఛట్!"

కాంతి అసహనంగా పిడికిళ్ళు గాలిలోకి విసిరేసింది.

విశాలి విస్తుపోయి చూస్తోంది. కణకణ మండే కాంతిని.

"వాళ్ళు సరైన పేరే పెట్టుకున్నారు -" బాడీ షాపింగ్". శరీరంతో సహా మెదడును హృదయాన్ని తాకట్టు పెట్టి ఈ హంగు ఆర్భాటం సృష్టించుకుంటున్నాం. వాళ్ళు చేయమన్న అప్పులల్లా చేసేస్తూ వాటిని తీరుస్తూ - మరమనుషుల్లా - స్వేచ్ఛాభిమానాలను తాకట్టు పెట్టుకున్నాం. వాళ్ళు ఆలోచించమన్నట్లుగా ఆలోచిస్తూ - వాళ్ళు నడవమన్నట్లుగా నడుస్తూ - బతుకుతున్నాం. పడగనీడలో నాగమణులు వెతుకుతూ.

ఛ! భయం... భయం... ఏవిటీ జీవితం - క్వార్టర్ వేస్తే చాక్లెట్ ఇచ్చే వెండింగ్ మిషిన్లా ...! "

కాంతి బైక్ పాత్ పై కూలబడింది. అన్ని సంకోచాలు వదిలేసి ఏడుస్తోంది.

ఈ మాటలు మాట్లాడడానికే ఇన్నాళ్ళు వేచివుందా అన్నట్లు - గుండెల్లో దుఃఖం అంతా కళ్ళల్లో ప్రవహింప చేస్తోంది. కట్ట తెగిన ఏరులా.

విశాలికి కాంతిని ఎలా ఓదార్చాలో తెలియలేదు. చిన్నప్పటి నుంచీ విశాలికి చెల్లెలే అండాదండా. మనోధైర్యం. అలాంటిది చెల్లెలే ముక్కలు ముక్కలై ఏడుస్తోంటే - ఏమీ తోచక చేష్టలుడిగి నిల్చుండిపోయింది.

తేరుకొన్నట్లుగా అసంకల్పితంగా నడక సాగించింది. గులాబీ గుబురువైపు.

ఒక్కో సంఘటన జ్ఞాపకం రాసాగింది. అడుగు అడుగులో.

సైంటిస్ట్ గారింటి చుట్టాలు, వంటమనిషి శాపనార్థాలు - ఎందుకో ఆమె మనసులో మెదిలాయి.

'పూలు విరగబూస్తాయన్నారు. ఏకంగా తల్లి వేరే తెగింది. ఫ్చ్!'

విశాలి మనసులో ఓ చిన్న ప్రశ్న ములుకులా గుచ్చుకుంది. "అవునూ... వాళ్ళు ఎవరి అనుమతి తీసుకొన్నారు. తమ తోటల్లోకి ప్రవేశించడానికి? ఎవరి సహకారంతో - తమ ఆవరణల్లోని చెట్టూ చేమ పొలిమేరలు దాటాయి? గుట్ట, మిట్ట, పుట్టల మీదుగా జీవ సంపదనంతా సంతోషంగా వారికి సమర్పణం చేసినది - దేనికి? వారి జీవ వైవిధ్యాన్ని వారు భద్రం చేసుకుంటుంటే మనం చేతులు ముడుచుకొని - ఏం చేస్తున్నాం? మన చేతులతో మనం - మన జాతికి ఆయువైన ఆ జన్యు సంపదను ఎలా ధారాదత్తం చేస్తున్నాం? తెలిసి తెలిసీ - మళ్ళీ మళ్ళీ -?"

విశాలి మనసులో తులప్ దుంపలను పక్కన పడేసిన ఆఫీసర్ మెదిలాడు ఎందుకోగానీ! విశాలి పెదవి బిగించింది. ముళ్ళ తీగల ఇనుప కంచె మీదుగా తన దృష్టిని సారించింది.

గులాబీ గుబురు వెనకాల - అదుగదుగో ఉత్తరేణి. ఇదిగిదుగో ఉమ్మెత్త. అక్కడ వేప. ఇక్కడ కరివేప.

విశాలి వెన్నులో చలి జరజర పాకింది.

'ఇంకా ఎన్నెన్ని రకాలో ...మరింకెన్ని జాతులో...!

ఇవన్నీ ఎక్కడి మట్టిలో పుట్టాయి? ఎక్కడి నీటిలో తడిచాయి? ఎక్కడి గాలి నింపుకున్నాయి?

ఇక్కడ పూసిన పూలు ఎక్కడి విత్తులవి?

ఇక్కడ చిగుర్చిన చెట్లు ఎక్కడి వేళ్ళవి?

ఇక్కడ విస్తరించి శాఖోపశాఖల తల్లివేరు ఏ నేలలో పాతుకుపోయి ఉంది?'

విశాలి కళ్ళు విప్పార్చి చూసింది.

ఒక కంట నీరు. మరొక కంట నిప్పు.

'చిన్నప్పుడు తమ సోషల్ సార్ తమకు నేర్పించాలని - ప్రయత్నించిన - భౌగోళిక శాస్త్రంలోకి ప్రతి పాఠం - ఇదుగో ఇక్కడ విరబూసి ఉంది. విరగకాసి ఉంది.

అమెజాన్, కాంగో, నైలూ, కలహారీ, మధ్యధరా, పశ్చిమాసియా, పనామా, మెక్సికో - ఏదైతేనేం? అక్కడ పెకలించబడి - ఇదుగో ఇక్కడే పునః ప్రతిష్ఠించబడింది!'

విశాలి తలెత్తి చూసింది.

గులాబీ గుబురు మీదుగా... ముళ్ళకంచె పైగా... బైకర్స్ పాత్ వైపు.

నిలువెత్తు నీరైన కాంతి.

తన చెల్లి.

తమ ఇంటిల్లిపాదికీ కంటి వెలుగు. ఏదో ఒక రోజున ఎవరి కంటికో నలుసై - నిర్దాక్షిణ్యంగా నలిపివేయబడుతుందా? ఈ వ్యాపార సంస్కృతి లో వినిమయ లోకంలో - వాడి విసిరేసే ఒక వస్తువులా - గిరాటు వేసేస్తారా?

అప్పుడు... అప్పుడు.. శక్తియుక్తులు జవసత్వాలు ఉడిగి - రసం పిండేసిన చెరకు పిప్పిలా... చప్పబడి పోతుందా? చలనం లేకుండా చతికిల బడిపోతుందా?

తమ ముంగిట ముద్దు గులాబి... చిట్టి తల్లి ...

విరిసీ విరియక మునుపే .. ! ? !'

విశాలి గొంతు పూడుకు పోయింది.

మరో ఆలోచనకు తావివ్వకుండా - తల వంచి ఏకాగ్రతతో - ముళ్ళ కంచెను తొలగించడం ప్రారంభించింది.

వట్టి చేతులతో.

చేతుల నిండా తుప్పు పట్టిన ఇనుము వాసన.

అయితేనేం?

ఆగేట్టు లేదు.

కాంతి ఎప్పుడు వచ్చిందో కానీ -

విశాలి పక్కనే నిలబడి కంచెను తొలగించడం ప్రారంభించింది.

అచ్చం అక్కలాగే.

నిశ్శబ్దంగా!

రచన

ప్రారంభం - 10 నవంబర్ 2006

ముగింపు - 19 నవంబరు 2006